

సనాతన ధర్మంతో విశ్వశాంతి

సనాతన ధర్మంతో విశ్వశాంతి నెలకొంటుందని శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతీ తీర్థ స్వామీజీ అన్నారు. - 10లో



తెప్పపై కల్యాణ వెంకన్న

కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా శుక్రవారం నారాయణవనంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామివారు తెప్పపై విహరించారు. - 10లో



వైభవం.. సహస్ర కలశాభిషేకం

పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహ స్వామికి శుక్రవారం ఏకోత్తర సహస్ర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

గరుడుడిపై కల్యాణ వెంకన్న



గరుడ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరస్వామి

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి వారు శుక్రవారం గరుడ వాహనంపై భక్తులను కటాక్షించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు వైఖానస ఆగమోక్తంగా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ చేశారు. అనంతరం స్వామివారు గరుడవాహనంపై కొలువుదీరి నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.

మహిళా సాధికారతే లక్ష్యం



మాట్లాడుతున్న శోభన్‌బాబు

రామచంద్రాపురం: మహిళా సాధికారతే లక్ష్యంగా పని చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు శోభన్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళ సంఘ సమాఖ్య సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళల ఆదాయ వనరులను పెంపొందించాలన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాలు క్రమం తప్పకుండా చెల్లించాని సూచించారు. అనంతరం మండల, గ్రామ సమాఖ్యల ఆడిట్ నివేదికలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం గురుమూర్తి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు సుధాకర్, అరుణ, పార్వతి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 19 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 56,711 మంది స్వామిని దర్శించుకున్నారు. 19,775 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.64 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని పేర్కొంది.

• కార్తీక పున్నమి.. శివకేశవుల స్మరామి



తిరుమలలో గరుడ వాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

హరిహరులకు ప్రీతికరం.. కార్తీక మాసం.. ఆపై పున్నమి.. ఇంకేముంది ప్రతి గుండెలో భక్తి పారవశ్యం ప్రతిధ్వనించింది. శివ కేశవుల స్మరణ మిన్నంటింది. తిరుమలలోని శ్రీవేంకటేశ్వర స్వామి గరుడుడిపై విహరించి.. భక్తులను కటాక్షించగా.. వాయులింగ క్షేత్రమైన శ్రీకాళహస్తిలో జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటికి వేదోక్తంగా ఊంజల్ సేవ నిర్వహించారు.

- తిరుమల/శ్రీకాళహస్తి



శ్రీకాళహస్తి ఆలయంలో శివపార్వతుల ఊంజల సేవ (ఇన్‌సెట్‌లో) ఉత్సవమూర్తుల ఊరేగింపు

సంజీవనికి సెలవు?

108 అంటే.. ప్రజల ప్రాణాలకు భరోసా.. ఆపదలో ఉంటే క్షణాల్లో వచ్చి ఊపిరిపోసే సంజీవని. అలాంటి అత్యవసర సేవలందించే వాహనాల సిబ్బంది సకాలంలో వేతనాల మంజూరు.. ఉద్యోగ భద్రత.. సమస్యల పరిష్కారం.. డిమాండ్ల సాధన కోసం సమ్మె సైరన్ మోగించారు. ఈ నెల 25 నుంచి విధులు బహిష్కరించనున్నారు. ఫలితంగా ఆ వాహనసేవలు ఆగిపోనున్నాయి.

- 25 నుంచి 108 ఉద్యోగులు సమ్మెకు సిద్ధం
- ఆగిపోనున్న అత్యవసర సేవలు
- జిల్లా అధికారులకు సమ్మె నోటీసులు

తిరుపతి తుడా: అత్యవసర పరిస్థితుల్లో రోగులను కాపాడే 108 ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 108 ఉద్యోగులు జీతాలు సక్రమంగా అందక నరకయాతన పడుతున్నారు. కుటుంబ భారాన్ని మోయలేక అప్పుల భారంతో ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఉద్యోగ భద్రత, వేతనాల చెల్లింపు, జీఓ నంబరు 49 అమలు తదితర సమస్యలపై కదం తొక్కనున్నారు. దీంతో ఈనెల 25 నుంచి సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మెలోకి వెళుతున్నట్లు 108 ఉద్యోగ సంఘ నాయకులు జిల్లా అధికారులకు నోటీసులు అందజేశారు.

అత్యవసర సేవలు ప్రశ్నార్థకమేనా?

ఈ నెల 25వ తేదీకి 108 ఉద్యోగులు సమ్మెకు ముహుర్తం ఖరారు చేశారు. దీంతో అత్యవసర సేవలకు బ్రేకులు పడనున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజూ 20 వేల కిలోమీటర్లు తిరుగుతూ వందకు పైగా అత్యవసర కేసులను ఆస్పత్రికి చేరుస్తూ...ప్రాణాలను కాపాడుతోంది. ప్రధానంగా రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, గర్భిణులు, ఇతరత్రా అత్యవసర కేసులకు ఈసేవలను అధిక సంఖ్యలో వినియోగిస్తున్నారు. అయితే ఈ సమ్మె కారణంగా వాహనాలు ఎక్కడికక్కడికి ఆగిపోనున్నాయి. ఉద్యోగులంతా రోడ్డుపైకి రానున్నారు. వాహనాలు సైతం కదిలే పరిస్థితి కనిపించడం లేదు. అయితే ప్రభుత్వం ఏమేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

డిమాండ్లు ఇవీ..

- 108 సర్వీస్‌లోని ఉద్యోగులను వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులుగా గుర్తించి నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలి.
- జీఓ నంబర్ 49ని పునరుద్ధరించాలి. పైలెట్ గ్రాట్యుటీ, ఎర్న్‌డ్ లీవ్ అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్‌లను చెల్లించాలి.
- ఈఎంటీ పోస్టుకు నిర్ధారించిన విద్యార్హతను సడలించి ప్రస్తుతం పనిచేస్తున్న ఈఎంటీల సర్వీసును పరిగణలోకి తీసుకుని డీఎంఈ ద్వారా మెడికల్ కాలేజీల్లో భర్తీ చేయనున్న పోస్టుల్లో తమను నియమించాలి.
- ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలి
- 108లో కూడా షిఫ్ట్ పద్ధతిని అమలు చేయాలి. 12 గంటలు పనిచేయడంతో ఒత్తిడి పెరిగి ఉద్యోగులు అనారోగ్య బారిన పడుతున్నారు. ఈ క్రమంలో ఉద్యోగులు 8 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.
- జీతంపై 40 శాతం ఇంక్రిమెంట్‌ను అందించాలి. అరియర్స్‌ను కలిపి వేతనంతో జమ చేయాలి.
- వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో సర్వీసుకు అనుగుణంగా వెయిటేజ్ మార్కులు అందించాలి.
- ఈపీఎఫ్‌కు సంబంధించిన యాజమాన్య వాటా సొమ్మును యాజమాన్యమే చెల్లించేలా చూడాలి. వేతన శ్లాబ్‌ల్లో మార్పులు తేవాలి.
- 108 వాహనాలు మరమ్మతులు సమయానికి చేయడం లేదు. దీని కారణంగా వాహనాల కండిషన్ తప్పుతున్నాయి. వాహన మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేయాలి.
- రిలీవింగ్ బిల్లులు, ఎలక్ట్రికల్ బిల్లులు, వాహన మైనర్ మరమ్మతు బిల్లులు ఉద్యోగులకు చెల్లించాల్సినవి వెంటనే చెల్లించాలి.
- విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మరణించిన తర్వాత బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేసియా రూ. 20 లక్షలు ఇవ్వాలి.
- అత్యవసర సేవలకు మాత్రమే 108 సేవలను వినియోగించేలా చర్యలు చేపట్టాలి. సిబ్బంది కొరతను అధిగమించాలి. ప్రతి మండల కేంద్రంలోనూ సిబ్బందికి కనీస అవసరాలతో కూడిన శాశ్వత భవనాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ 108 ఉద్యోగులు సమ్మె సైరన్ మోగించారు. అధికారులకు నోటీసులు ఇచ్చారు.



అధికారులకు పలుసార్లు విన్నవించినా...

తిరుపతి జిల్లాలో 108 వాహనాలు 41 నడుస్తున్నాయి. ప్రతిరోజు 20 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. ఈ వాహనాల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు(ఈఎంటీ) 103 మందికిగాను 88 ఉండగా, పైలెట్లు 103 మందికిగాను 83 మంది మాత్రమే పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో అత్యవసర వైద్య సేవలు అందించడంలో వీరంతా కీలకంగా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే వీరి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక జీతాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. మూడు నెలల జీతాలు అందక పోగా...ఉద్యోగ భద్రత లేదని 108 ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు పలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రాష్ట్ర ఉద్యోగుల యూనియన్ సమ్మె సైరన్ మోగించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డీఎంఅండ్‌హెచ్ఓ, ఎంపీడీఓ, తహసీల్దార్లలను కలిసి నోటీసులు అందజేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న ఈ సమ్మెకు సహకరించాలని కోరారు.

108ఉద్యోగుల పరిస్థితి దారుణం



ఎంతో మంది ప్రాణాలను ఆపద్బాంధవులులా కాపాడిన 108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. మూడు నెలలుగా జీతాలు లేవు. వార్షిక ఇంక్రిమెంట్ మాటేలేదు. జీఓ 49ను వెంటనే అమలు చేయాలి. ఎర్న్‌డ్ లీవ్, గ్రాట్యుటీ, ఉద్యోగ భద్రత, నెలవారీ వేతనాలు తదితర సమస్యలపై సమ్మెకు దిగుతున్నాం. పలుసార్లు అధికారులకు విన్నవించినా పెడచెవిన పెట్టడం దారుణం. ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు దిగుతున్నాం.

-కే మహేష్, 108 ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, తిరుపతి

విధిలేక సమ్మెకు దిగుతున్నాం



108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పెడచెవిన పెడుతోంది. సక్రమంగా వేతనాలు చెల్లించకుండా ఉద్యోగులను అప్పుల పాలు చేస్తోంది. ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాలు చెల్లించాలి. ఇంక్రిమెంట్ 40 శాతం పెంచాలి. షిఫ్టులు ప్రకారం విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలి. సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు సమ్మె విరమించేదిలేదు.

-మునిరాజ, 108 ఉద్యోగ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, తిరుపతి

పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదు



ప్రభుత్వ అధికారులకు తమ సమస్యలను పలుసార్లు విన్నవించాం. అయినా పట్టించుకోలేదు. అందుకే ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెకు దిగుతున్నాం. 108 ఉద్యోగులకు ఆరోగ్యశాఖ చేపట్టే నియామకాల్లో వెయిటేజ్ ఇవ్వాలి. మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించాలి. ఇంక్రిమెంట్లు, ఈపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలి.

-కే సునీల్, 108 ఉద్యోగుల వర్కింగ్ ప్రెసిడెంట్, తిరుపతి

సైఖితం.. సంకటం

సామాన్యులకు సైఖతం అందనంటోంది. ఇసుక లేదన్న సాకు చూపి పాత పాయింట్లకు కూటమి సర్కారు మంగళం పాడుతోంది. కొత్త పాయింట్లు.. స్టాక్ యార్డులంటూ కథలు చెబుతూ ఇసుక వ్యాపారానికి తెరతీస్తోంది. ఇప్పటికే ఈ దిశగా అడుగులు పడ్డాయి. ఉచితమన్న మాటపోయి.. ధరల నిర్ణయం జరిగింది. అయినా ఇసుక అందేనా అన్న అనుమానం కలుగుతోంది.

పాత ఇసుక పాయింట్లకు మంగళం

- కొత్త ఇసుక పాయింట్ల వస్తాయంటా?
- జిల్లాలో మూడుచోట్ల గుర్తింపు
- కొత్త ఇసుక రీచ్‌లపై కొండంత ఆశ
- కొత్త పాయింట్లలో సామాన్యులకు ఇసుక అందేనా?



కోట మండలం గూడలి గ్రామం వద్ద గుర్తించిన కొత్త ఇసుక రీచ్ నుంచి ఇసుకను తరలిస్తున్న కూటమి నేతలు(ఫైల్)

తిరుపతి అర్బన్: కూటమి సర్కార్ జూలై 8వ తేదీ నుంచి తీసుకొచ్చిన ఇసుక పాలసీతో నెలకొన్న కష్టాలు తెలిసిందే. సామాన్యుడు ఇంటి నిర్మాణంకు ఇసుక కొరత ఏ స్థాయిలో ఉందో జిల్లా వాప్తంగా చోటుచేసుకున్న పరిస్థితులు అన్నిఇన్నీకాదు. అయితే కూటమి నేతలు మాత్రమే దండిగానే ఇసుక వ్యాపారం చేసుకుని లక్షల రూపాయిలు వెనుకేసుకున్నారు. జిల్లా ఇసుకతో జిల్లాలోనే కాకుండా ఇటు తమిళనాడుకు అటు కర్నాటకు సైతం ఇసుకను తరలించి వ్యాపార కేంద్రం జిల్లాను మార్చారు. ఈ క్రమంలో అధికారపార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, పలువురు ప్రజా ప్రతినిధులే కాకుండా ఇటీవల గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సైతం ఇంటి నిర్మాణాల జాప్యానికి ఇసుక కొరత ప్రధాన అంశంగా మీడియాకు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే జూలై 8న జిల్లాలో ఏర్పాటు చేసిన 4 ఇసుక పాయింట్లలో ఇసుక లేదని వాటికి మంగళం చెప్పారు. కొత్తగా జిల్లాలో మూడు ఇసుక పాయింట్లు గుర్తించామని అధికారులు అంటున్నారు.

30 నుంచి మూడు కొత్త ఇసుక పాయింట్లు

జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి కొత్తగా జిల్లాలో మూడు ఇసుక పాయింట్లను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కోట మండలంలోని గూడలి గ్రామం సమీపంలో స్వర్ణముఖి బ్యారేజీ అప్ స్ట్రీమ్ వద్ద ఒక ఇసుక పాయింట్, అదే ప్రాంతంలో డౌన్ స్ట్రీమ్ వద్ద మరో పాయింట్ , పెళ్లకూరు మండలంలోని పుల్లూరు గ్రామం, పాలచ్చురు వద్ద ఇంకొ ఇసుక పాయింట్‌ను గుర్తించారు. ఈ మూడు పాయింట్లు అయినా అందుబాటులో ఉంటాయా? లేదా అన్నది సందేహాస్పదంగా మారింది.

30 నుంచి 1.37 లక్షల టన్నుల ఇసుక

కలెక్టరేట్ నుంచి ఉన్నతాధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఇసుకపై ఇలా మాట్లాడారు. జిల్లాలో కోట మండలం గూడలి గ్రామం స్వర్ణముఖి బ్యారేజ్ వద్ద రెండు ఇసుక పాయింట్లు, పెళ్లకూరు మండలంలోని పుల్లూరు గ్రామం పాలచ్చూరు వద్ద ఒక ఇసుక పాయింట్ గుర్తించామని. ఆ మూడు పాయింట్లలో 1.37 లక్షల టన్నుల ఇసుక నిల్వలున్నాయని, వాటిని ఈ నెల 30 నుంచి జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. దీంతో జిల్లా ప్రజలు ఆ ఇసుకపై ఆశలు పెట్టుకుంటున్నారు.

ముందే ఇసుక దోపిడీ

కోట మండలంలోని గూడలి గ్రామం సమీపంలోని స్వర్ణముఖి బ్యారేజ్ వద్ద ఇసుక ఉన్న సంగతిని కూటమి నేతలు ముందే గుర్తించి ఇటీవల దోపిడీకి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. అయితే పలు పత్రికల్లో కథనాలు రావడంతో ప్రస్తుతం అధికారులు ఆ ప్రాంతంలోని ఇసుకను తరలించకుండా కంచె ఏర్పాటు చేసి ఉన్నారు. ఈ నెల 30వ తేదీన అధికారికంగా ప్రభుత్వం ఇసుక పాయింట్‌గా గూడిలి ప్రాంతాన్ని గుర్తిస్తే.. తర్వాత అయినా సామాన్యులకు ఇసుక తీసుకుపోయే ఛాన్స్ ఉంటుందా? లేదా కూటమి నేతలే మళ్లీ వ్యాపారం మొదలుపెడుతారా? అనే సందేహాలున్నాయి.

పాత ఇసుక పాయింట్లకు మంగళం

జూలై 8న ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు ఇసుక పాయింట్ల సంగతి ముగిసింది. గట్టిగా పది రోజులుగా ఈ పాయింట్ల నుంచి సక్రమంగా సామాన్యలకు ఇసుకను అందించలేకపోయారు. తాజాగా కొత్త పాయింట్లు రాగాన్ని తీస్తున్నారు. కొత్త పాయింట్లలోనేనా దీర్ఘకాలం ఇసుకను అందిస్తారా..అనేది ప్రశ్నార్థకంగా ఉందని అంతా చర్చించుకుంటున్నారు.

మండలం	ప్రాంతం	టన్ను ధర రూ
వెంకటగిరి	మెగళ్లగుంట	590
సూళ్లూరుపేట	మావిళ్లపాడు	465
పిచ్చాటూరు	ఏకే బేడు	200
నాగలాపురుం	సుబ్బానాయుడుకండ్రిగ	200

దరఖాస్తుల ఆహ్వానం

- 19 వరకు దరఖాస్తులకు గడువు
- 20న వ్యాపారుల ఎంపిక
- జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డ్‌లకు అనుమతులు
- కాటన్ మిల్, అవిలాల, గాజులమండ్యం

తిరుపతి అర్బన్: సాధారణంగా కూరగాయలు, నిత్యావసర వస్తువులు లేదా సిమెంట్, కమ్మి తదితర వాటిని స్టాక్ యార్డ్‌లకు వెళ్లి కొనుగోలు చేయడం తెలిసిందే. అయితే కూటమి సర్కార్ కొత్తగా ఇసుక స్టాక్ యార్డ్‌లను ఏర్పాటు చేస్తోంది. అన్నమయ్య జిల్లా నుంచి ఇసుకను తెచ్చుకుని తిరుపతి జిల్లాలో వ్యాపారం చేసుకోవడానికి వీలుగా దరఖాస్తులను ఆహ్వానించారు. ఇసుక వ్యాపారులు ఈ నెల 19వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు గనులశాఖ వారికి దరఖాస్తులు సమర్పించాలి. 20వ తేదీన ఇసుక వ్యాపారులను ఎంపిక చేస్తారు. ఆ మేరకు వ్యాపారులు వారి సొంత భూమి లేదా ప్రభుత్వ భూమి చూపి, దరఖాస్తులతోపాటు అధికారులతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఒప్పందాన్ని కుదుర్చుకుని వ్యాపారం చేసుకోవచ్చు. ఆ మేరకు ఇసుక కమిటీ జిల్లా చైర్మన్ హోదాలో కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అదనపు సమాచారం కోసం గనులశాఖకు చెందిన ఉద్యోగులు 91006 88839, 90003 73069 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో మూడు ఇసుక స్టాక్ యార్డ్‌లు

- రేణిగుంట మండలంలోని గాజులమండ్యం వద్ద ఇసుక స్టాక్ యార్డ్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారు. వారు అన్నమయ్య జిల్లా నందలూరు మండలంలోని టంగుటూరు నుంచి ఇసుకను తెచ్చుకుని గాజులమండ్యం వద్ద వ్యాపారం చేసుకోవచ్చు. టన్ను రూ. 675కి మాత్రమే విక్రయించాలి.
- తిరుపతి రూరల్ అవిలాల గ్రామం వద్ద ఇసుక స్టాక్ యార్డ్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారు. వారు అన్నమయ్య జిల్లా నందలూరు మండలంలోని టంగుటూరు నుంచి ఇసుకను తెచ్చుకుని అవిలాల వద్ద టన్ను రూ.638 నుంచి 640 వరకు విక్రయించుకోవచ్చు.
- తిరుపతి కాటన్‌మిల్ వద్ద ఇసుక స్టాక్ యార్డ్‌ను ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చారు. ఇక్కడ అన్నమయ్య జిల్లా పెనమలూరు మండలంలోని నారాయణ నెల్లూరు వద్ద నుంచి ఇసుక తెచ్చుకుని టన్ను ఇసుక రూ.638 నుంచి రూ.640కి విక్రయించాలి.

డేటా ఎంట్రీ ఆపరేటర్లపై ఆధారపడొద్దు

తిరుపతి అర్బన్: 'కొందరు తహసీల్దార్లు తమ కార్యాలయంలోని డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పూర్తిగా పగ్గాలు అప్పగించి.. వారిపై ఆధారపడి పనిచేస్తున్నారు. వారికి ఎంతమేరకు బాధ్యతలు అప్పగించాలో అంత వరకే ఇవ్వాలి. వారిపై ఆధారపడవద్దు.' అని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రెవెన్యూ అధికారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సమస్యలు అధికం అవుతున్నాయన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీల్లోనూ 70 నుంచి 80 శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయని చెప్పారు. ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి, పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఇకపై ప్రతి రెండు నెలలకొకసారి జిల్లాస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. భూతగాదాలకు ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని సూచించారు. లేదంటే అది భూ సమస్యగానే కాకుండా శాంతిభద్రత సమస్యగా తలెత్తేప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ ఏడాదికి చివరికల్లా రెవెన్యూ సమస్యలను ఒక కొల్కికి తీసుకురావాలని ఆదేశించారు. కోర్టులో పెండింగ్ ఉన్న రెవెన్యూ అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రభుత్వ నిబంధనలు దృష్టిలో పెట్టుకుని అప్పీల్‌కు వెళ్లాల్సి ఉంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇసుకను ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ద్వారా తీసుకుపోతుంటే అభ్యంతరం చెప్పవద్దన్నారు. అధికారులంతా సమన్వయంతో కలసి పని చేసి, జిల్లాను ముందుకు నడిపిద్దామని పిలుపు నిచ్చారు. జేసీ శుభం బన్సల్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఆర్వో నరసింహులు, ఆర్డీఓలు భానుప్రకాష్ రెడ్డి, సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, సర్వేఅధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.76,430
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.6,937

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.91,300
రిటైల్ వెండి గ్రాము	రూ.9430

క్లుప్తంగా

19 నుంచి 'హమారా సౌచాలయ.. హమారా సమ్మాన్'

తిరుపతి అర్బన్: ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీన హమారా సౌచాలయ.. హమారా సమ్మాన్ పేరుతో ప్రజలకు మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో కాకుండా మరుగుదొడ్లను ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశాలను ఈ నెల 19 నుంచి వచ్చేనెల 10వ తేదీ వరకు తెలియజేయనున్నారు. హమారా సౌచాలయ.. హమారా సమ్మాన్ క్యాంపెయిన్ పేరుతో కార్యక్రమాలు చేపట్టడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆ మేరకు ఇప్పటికే కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

జూడోలో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు అందుకున్న విజేతలతో అధికారులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో భాగంగా వర్సిటీ వేదికగా శుక్రవారం జరిగిన జూడో పురుషుల విభాగం పోటీల్లో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచారు. ఇందులో ఎస్వీ ఆర్ట్స్ కళాశాలకు చెందిన విద్యార్థులు డి మల్లికార్జున, ఎస్ హరి, ఆర్ గణేష్, కే పార్థసారథి, సీకాం కళాశాలకు చెందిన వంశీనాయక్, ఎస్‌జీఎస్ కళాశాలకు చెందిన నందకుమార్ గెలుపొందారు. అలాగే ఎస్వీయూ కళాశాలకు చెందిన గోవర్ధన్ విజేతగా నిలిచారు. వారికి ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం శివశంకర్‌రెడ్డి, నరసింహారావు, కోచ్ గోపి, అధ్యాపకులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. పలువురు అధికారులు, అధ్యాపకులు, పుర ప్రముఖులు విజేతలైన క్రీడాకారులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

సనాతన ధర్మంతో విశ్వశాంతి

- శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతీ తీర్థ స్వామిజీ



ఆలయం వెలుపలకు వస్తున్న శ్రీవిదుశేఖర భారతీ తీర్థ స్వామీజి

తిరుపతి కల్చరల్: సనాతన ధర్మం పాటించడంతో విశ్వశాంతి నెలకొంటుందని శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి శ్రీవిధుశేఖర భారతీ తీర్థ స్వామీజీ ఉద్ఘాటించారు. విజయయాత్రలో భాగంగా తిరుపతి విచ్చేసిన స్వామీజీ తిరుమల శ్రీవారి దర్శనానంతరం శ్రీకోదండరాములవారి ఉత్తర మాడ వీధిలోని శృంగేరి శంకర మఠానికి విచ్చేశారు. ముందుగా శ్రీకోదండరామాలయంలో సీతాలక్ష్మణ సమేత శ్రీకోదండరాముల వారిని దర్శించుకున్నారు. అనంతరం శృంగేరి మఠానికి చేరుకున్నారు. అక్కడ శృంగేరి మఠం ప్రతినిధులు స్వామివారికి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆహ్వానించారు. శృంగేరి మఠానికి విచ్చేసిన స్వామీజీని భక్తులు దర్శించుకుని పాద పూజలు చేసి, ఆశీస్సులు అందుకున్నారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఆదిశంకరాచార్యులు శృంగేరి, శారదపీఠాలతో పాటు పూరి, బదరీలో నాలుగు పీఠాలను ఏర్పాటు చేసి, అద్వైత సిద్ధాంతాన్ని తీసుకొచ్చారన్నారు. తద్వారా సనాతన ధర్మాన్ని చాటుతూ సమాజంలో సమానత్వాన్ని చాటుతూ ప్రపంచ శాంతి కోసం కృషి చేశారని తెలిపారు. ఆ మహనీయుని అద్వైత సిద్ధాన్ని ఆచరిస్తూ సనాతన ధర్మ ప్రచారానికి నిరంతరం ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాలను ఆచరిస్తూ ప్రపంచ శాంతికి దోహదపడాలని సూచించారు. భారతీ తీర్థ స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ చంద్రమౌళి స్వామి పూజ నిర్వహించారు.

స్వామీజీ ఆశీస్సులు అందుకున్న ఈఓ

తిరుపతిలోని శృంగేరి శంకర మఠానికి విచ్చేసిన శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ తీర్థస్వామిజీని టీటీడీ ఈఓ శ్యామలరావు దంపతులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ దంపతులను స్వామీజీ సత్కరించారు. అనంతరం సనాతన ధర్మవ్యాప్తిని, వేద పరిరక్షణ, వేద విద్యావ్యాప్తికి టీటీడీ చేపడుతున్న కార్యక్రమాలను ఈఓ స్వామీజీకి వివరించారు.

అమ్మవారి సేవలో శ్రీశృంగేరి పీఠం ఉత్తరాధికారి

చంద్రగిరి(తిరుచానూరు): శ్రీశృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి శ్రీవిదుశేఖర భారతీ తీర్థ స్వామీజీ శుక్రవారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయాధికారులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈఓ బాపిరెడ్డి

నేడు శృంగేరి శారద పీఠాధిపతి రాక

శ్రీకాళహస్తి: శృంగేరి శారద పీఠాధిపతి శ్రీవిదుశేఖర భారతీ తీర్థ స్వామీజీ శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈఓ బాపిరెడ్డి ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వర ఆలయాధికారులు కృష్ణారెడ్డి, లోకేష్ రెడ్డి, హేమమాలిని, మురళీధర్‌రెడ్డి, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తెప్పపై కల్యాణ వెంకన్న దివ్యదర్శనం



తెప్పపై విహరిస్తున్న కల్యాణ వెంకన్న

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న కార్తీక తెప్పోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామివారు పద్మసరస్సులో తెప్పపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాత సేవతో నిత్య కైంకర్యాలు, ఏకాంతంగా శుక్రవారం అభిషేకాలు పూర్తి చేశారు. ఉదయం 9 గంటలకు ఉభయ దేవేరులతో వెంకన్న ఉత్సవమూర్తులకు కల్యాణ మండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించి, ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. కార్తీక పున్నమిని పురస్కరించుకుని ఉదయం నుంచి భక్తులు ఆలయాన్ని సందర్శించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులకు విశేషాలంకరణ చేసి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. మేళ తాళాలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపు ప్రారంభమైంది. సన్నిధి వీధిలో ఆంనేయస్వామి ఆలయం వద్ద సురాపాన దహన కార్యక్రమం నిర్వహించారు. క్షీర సముద్ర మథనంతో ఉద్భవించిన అమృతాన్ని స్వీకరించిన దేవతలు స్వర్గానికి వెళ్లే ముందు మార్గాన్ని కొలిచిన వైనాన్ని కార్తీక దీపం రోజున నారాయణవనంలో నిర్వహించడం ఆనవాయతీగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా ఆంజనేయస్వామి ఆలయం వద్ద తాటాకు మట్టలతో ఏర్పాటు చేసిన గోపురానికి నిప్పు పెట్టి దహనం చేశారు. అనంతరం పద్మసరస్సులో తెప్పపై ఉత్సవర్లను కొలువుదీర్చారు. సరస్సులో తెప్పపై ఏడు ప్రదక్షిణలు చేసిన ఉత్సవర్లు ఆలయానికి చేరుకుని ఆస్థానంలో పాల్గొన్నారు. అనంతరం అర్చకులు ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయాధికారి నాగరాజు, ఏఈలు ఏఈలు గురుప్రసాద్, నందిబాబు, భద్రతా జమేదార్ మల్లిఖార్జున పాల్గొన్నారు.

జీఓ 117ను తక్షణమే రద్దు చేయాలి

–పీడీఎస్‌యూ రాష్ట్ర నేతలు వెల్లడి

తిరుపతి కల్చరల్: విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టులా ఉన్న జీఓ 117ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు ఇ.భూషణం డిమాండ్ చేశారు. శుక్రవారం ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వందల సంఖ్యలో జూనియన్ కళాశాలలున్నా వాటిలో లెక్చరర్ పోస్టులు ఇప్పటి వరకు భర్తీ చేయకుండా గెస్ట్ లెక్చరర్లతో విద్యాబోధన చేయడం విడ్డూరమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని, సంక్షేమ హాస్టల్ బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చినా హామీలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రభుత్వ విద్యా వ్యవస్థ సమస్యల గురించి మాట్లాడలేదన్నారు. సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చి ఇప్పటికి వాటిని అమలు చేయలేదన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేష్ ఇప్పటికైనా అసెంబ్లీలో ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతంపై చర్చించాలని డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భూషణం

జనవరిలో తల్లికి వందనం అమలు చేస్తామని దానికి కూడా నిబంధనలు వర్తిస్తాయడం సరికాదన్నారు. తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి విద్యార్థికీ ఈ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై స్పందించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు . లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలు తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భాస్కర్, ఉపాధ్యక్షుడు మహర్షి, కోశాధికారి, మహేంద్రబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, ధనశేఖర్, వినోద్, క్రాంతి, జిల్లా కన్వీనర్ మహేష్ పాల్గొన్నారు.

కెనరాబ్యాంక్ సేవలు మరింత విస్తృతం

తిరుపతి కల్చరల్: కెనరా బ్యాంక్ సేవలను మరింత విస్తృతం చేసి, ప్రజలకు చేరువ చేయనున్నట్లు ఆ బ్యాంక్ ఎండీ, సీఈఓ కె.సత్యనారాయణరాజు తెలిపారు. ఆర్సీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కెనరా బ్యాంక్ సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంక్ నూతన పద్ధతులను పాటించి, మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. ఇప్పటి వరకు తిరుపతిలో బ్యాంకులకు సంబంధించిన రీజినల్ కార్యాలయాలు మాత్రమే ఉన్నాయని, సర్కిల్ ఆఫీసును ఒక కెనరా బ్యాంక్ మాత్రమే ఏర్పాటు చేసిందన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఏఐ టెక్నాలజీ వినియోగించి ఏఐ1 యాప్‌ను కెనరా బ్యాంక్ రూపొందించిందన్నారు. దేశంలోని పబ్లిక్ సెక్టార్ బ్యాంకులన్నింటిలో తమ బ్యాంకు రూపొందించిన ఏఐ1యాప్‌కు 2.62 కోట్ల మంది



కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీసును ప్రారంభిస్తున్న సత్యనారాయణరాజు

యూజర్స్ ఉన్నారని తెలిపారు. 11 భాషల్లో ఏఐ1 యాప్ పని చేస్తోందని తెలిపారు. బ్రాంచ్ జీఎం పాండురంగ మితంత్య, బ్రాంచి జీఎడబ్ల్యూ జీఎం రామనాయక్, కేంద్ర కార్యాలయం జీఎం రవికృష్ణ, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ సత్యప్రకాష్ సింగ్, పాల్గొన్నారు.

వైభవంగా ఏకోత్తర సహస్ర కలశాభిషేకం



అలంకార మండపంలో ఏర్పాటుచేసిన 1001 కలశాలు

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం ఏకోత్తర సహస్ర కలశాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు శ్రీవారి అలంకార మండపంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి , ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి, సుదర్శన ఆళ్వార్ ఉత్సవమూర్తులను పీఠంపై కొలువుతీర్చి, దేవతామూర్తుల ఎదుట 1001 కలశాలు ప్రతిష్ఠించి ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం పాలు, తేనె, పసుపు, కుంకుమ, నారికేళ జలం, చందనం, నెయ్యి, పండ్లరసాలతోపాటు 1001 కలశాల్లో ఉంచిన నది, సముద్రం, బావి జలాలు, చెరుకు రసం, అడవి చెట్ల కషాయాలతో స్వామి అమ్మవార్లు, సుదర్శన ఆళ్వార్‌కు స్నపనతిరుమంజనం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్లను తిరుచ్చిపై కొలువుదీర్చి, కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్యస్వామి, సీతారామయ్యస్వామి అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, వర్ధన్‌స్వామి, నాగరాజస్వామి పాల్గొన్నారు.

ఏపీ బడ్జెట్‌పై అవగాహన సదస్సు

తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌తో విద్యావ్యవస్థలో పెనుమార్పులకు అవకాశం ఉంటుందని ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు అభిప్రాయపడ్డారు. ఎస్వీయూ సెనేట్ హాల్ వేదికగా శుక్రవారం ఏపీ బడ్జెట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏపీ బడ్జెట్‌లో విద్యారంగానికి రూ.2,326 కోట్లు కేటాయించారని తెలిపారు. సాధారణ నిధులతో పాటు ఉన్నత విద్యకు ప్రత్యేకంగా నిధులు కేటాయించడం శుభపరిణామన్నారు. నాణ్యమైన విద్య, నైపుణ్యం కలిగిన ఫ్యాకల్టీల అవసరాన్ని గుర్తించారని పేర్కొన్నారు. విశ్రాంత ప్రొఫెసర్ మునిరత్నం నాయుడు మాట్లాడుతూ సంపదను సృషించడం



సదస్సులో మాట్లాడుతున్న వీసీ సీహెచ్ అప్పారావు

ద్వారా రాష్ట్రాన్ని ఆర్థికంగా పునరుజ్జీవింపజేయాలని సూచించారు. ఈ సదస్సులో రిజిస్ట్రార్ భూపతినాయుడు, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుధారాణి, ఆర్థిక శాఖ అధ్యాపకులు రాధిక, సునీత, అకడమిక్ కన్సల్టెంట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కండలేరులో 55 టీఎంసీల నీరు నిల్వ చేస్తాం

రాపూరు: కండలేరు జలాశయంలో ఈ ఏడాది 55 టీఎంసీల నీరు నిల్వ చేస్తామని తెలుగుగంగ ఎస్ఈ రమణారెడ్డి తెలిపారు. కండలేరు జలాశయం, హెడ్ రెగ్యులేటర్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జలాశయంలో 55 టీఎంసీల నీరు నిల్వ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. ప్రస్తుతం జలాశయంలో 51.730 టీఎంసీల నీరు ఉందన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేస్తామని చెప్పారు. హెడ్‌రెగ్యులేటర్ వద్ద గేట్లు మరమ్మతులకు ప్రభుత్వం రూ.కోటి మంజూరు చేయడంతో టెండర్లు నిర్వహించి, పనులు ప్రారంభించామన్నారు. నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా జలాశయం నీరు అందిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట ఈఈ విజయకుమార్ రెడ్డి, డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుపతయ్య తదితరులు ఉన్నారు.

కండలేరులో 51.730 టీఎంసీల నీరు

కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 51.730 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. వరదకాలువ నుంచి 750 క్యూసెక్కులు, సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,250 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 1,150, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 60, మొదటి బ్రాంచ్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

తిరుపతి రూరల్: మండలంలోని సాయినగర్ పంచాయతీకి చెందిన ఈ.రేఖ(35) రెండు రోజుల కిందట అదృశ్యమైందని ఆమె తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు శుక్రవారం తెలిపారు. భర్త పార్థసారథితో మనస్పర్థల కారణంగా రేఖ ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వచ్చి కనపించకుండా పోయిందని, ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపింది. రేఖ సమాచారం తెలిస్తే 9491074525 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.



రేఖ(ఫైల్)

విశ్వబ్రాహ్మణ సేవా సమితి నూతన జిల్లా కమిటీ



నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: స్వర్ణాంధ్ర విశ్వబ్రాహ్మణ సేవా సమితి నూతన జిల్లా కమిటీ ఎన్నికలు శుక్రవారం యూత్ హాస్టల్లో నిర్వహించారు. ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మనోహర్ ఆచారి అధ్యక్షతతన ఏర్పాటు చేసి విశ్వబ్రాహ్మణ సేవా సమితి సమావేశంలో జిల్లా నూతన కమిటీ ఎన్నిక జరిపారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి విశ్వబ్రాహ్మణ ప్రతినిధులు జిల్లా కమిటీ ఎన్నికల్లో పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర విశ్వబ్రాహ్మణ సేవా సమితి జిల్లా అధ్యక్షుడిగా జి.కోవెల తిరుమలాచారి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా రామచంద్రాచారి, తిరుపతి నగర అధ్యక్షుడిగా శ్రీమంతుల రామయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ పూర్తిస్థాయి జిల్లా కమిటీని, తిరుపతి నగర నూతన కమిటీ ఎన్నికలను త్వరలోనే పూర్తి చేసి, కమిటీ ప్రతినిధులతో ప్రమాణ స్వీకారం చేయించనున్నట్లు తెలిపారు.

22 కేజీల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న అలిపిరి పోలీసులు

తిరుపతి క్రైమ్: నగరంలో శుక్రవారం అక్రమంగా విక్రయిస్తున్న 22 కిలోల గంజాయిని అలిపిరి పోలీసులు స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అలిపిరి పోలీసులు కథనం మేరకు.. తిరుపతి జిల్లాకు చెందిన మందారపు మాధవ, తోట సందీప్ కొంతకాలంగా గంజాయి అక్రమంగా రవాణా చేసి, విక్రయిస్తున్నారు. అలిపిరి పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం తనిఖీలు చేస్తుండగా ఆటోనగర్ వద్ద ఓ ఆటోలో అనుమానాస్పదంగా ఉన్న వారిని తనిఖీ చేశారు. ఆటోలో 22 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి, ఆటోను స్వాధీనం చేసుకుని మందారపు మాధవ, తోట సందీప్‌ను అరెస్టు చేశారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

నాగలాపురం: స్థానిక బైపాస్ రోడ్డులో అక్రమంగా తరలిస్తున్న 12 కిలోలు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సత్యవేడు సీఐ మురళీనాయుడు తెలిపారు. సీఐ కథనం మేరకు.. నాగలాపురం బైపాసురోడ్డులో శుక్రవారం పోలీసులు నాకాబందీ చేపట్టారు. ఆ సమయంలో తమిళనాడుకు చెందిన ముగ్గురు వ్యక్తులను ఆ మార్గంలో వాహనంలో వస్తుండగా ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద 12 కిలోల గంజాయి ఉండగా గుర్తించి వారిని అరెస్టు చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, నిందితులను సత్యవేడు కోర్టులో హాజరుపరిచి, రిమాండుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

పోలీసులపై బాంబు విసిరిన వ్యక్తి అరెస్టు



నిందితుడు జోసెఫ్‌తో పోలీసులు

తడ: పోలీసులపై నాటుబాంబు విసిరి పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేసినట్టు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. ఆయన శుక్రవారం తడలో విలేకరులకు ఈ వివరాలు వెల్లడించారు. తమిళనాడుకు చెందిన కొందరు నేరస్తులు తడ కండ్రిగ పంచాయతీ, బీఎల్ పాడు గ్రామం వద్ద ఉన్న ఓ హోటల్ సమీపంలోని ఇంట్లో ఉన్నట్టు గుర్తించిన తమిళనాడు, మదురవాయిల్ పోలీస్ స్టేషన్‌కి చెందిన ముగ్గురు పోలీసులు 2021 ఏప్రిల్ 27వ తేదీన దాడి చేశారు. దాడి సమయంలో గదిలో తొమ్మి మంది ఉన్నారు. దాడి సమాచారం తెలుసుకున్న వారిలో ఒకరైన చెన్నై, మాధవరం ప్రాంతానికి చెందిన వర్గీస్ జోసెఫ్ పోలీసులపై నాటు బాంబు వేసి, పరారయ్యాడు. దీనిపై తడలో కేసు నమోదైంది. ఈ కేసులో నిందితుడుగా ఉన్న జోసెఫ్ తడ రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్నట్టు శుక్రవారం అందిన సమాచారంతో సీఐ మురళీకృష్ణ, తడ ఎస్ఐ, సిబ్బందితో కలిసి నిందితుడిని అరెస్టు చేశారు.

భూ ఆక్రమణపై టీడీపీ నేత జేబీ శ్రీనివాస్‌పై కేసు

తిరుపతి రూరల్: దౌర్జన్యంగా తన భూమిలోకి ప్రవేశించడమే కాకుండా కబ్జా చేసేందుకు గుడిసెలు వేశారని బాధితుడు ఫిర్యాదు మేరకు తిరుపతికి చెందిన టీడీపీ నాయకుడు జేబీ శ్రీనివాస్‌తోపాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సెప్టెంబర్ 22వ తేదీన జరిగిన ఈ ఘటనపై తిరుపతి రూరల్ పోలీసులు ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి రూరల్ మండలం శ్రీనివాసపురం పంచాయతీలోని కృష్ణారెడ్డి నగర్ సర్వే నంబర్ 249/4, 249/5లో 1.36 ఎకరాల భూమిని పాట్టెయ్య, ఇతరుల నుంచి తుంగ బాలకృష్ణ 1996లో కొనుగోలు చేశారు. అయితే ఈ భూమిని పక్క స్థలం వారు 2006లో ఆక్రమించి వెంచర్ వేసి విక్రయించారు. దీనిపై తుంగ బాలకృష్ణ హైకోర్టును ఆశ్రయించగా అనుకూలంగా తీర్పు ఇచ్చింది. 2019లో ల్యాండ్ కమిషన్ ఆఫీస్ ఉత్తర్వుల మేరకు ఆర్డీవో, ఇనాం డిప్యూటీ తహసీల్దార్ పట్టా ప్రొసీడింగ్స్ ఇచ్చారు. జాతీయ రహదారికి సమీపంలోని కేఆర్ నగర్‌లో కోట్లాది రూపాయల విలువైన ఈ భూమి ఖాళీగా ఉండడంతో టీడీపీ నేత జేబీ శ్రీనివాస్, జనార్ధననాయుడు మరికొందరితో కలిసి సెప్టెంబర్ 22వ తేదీన ఈ భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి, కబ్జా చేసేందుకు ప్రయత్నించి గుడిసెలు వేశారు. బాధితుడు అడ్డుకునే ప్రయత్నం చేసిన ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం రాత్రి తిరుపతి రూరల్ పోలీసుల కేసు నమోదు చేశారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు గ్రామానికి చెందిన శివ అలియాస్ లక్ష్మయ్య (23)ను పోక్సో కేసులో అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు శుక్రవారం తెలిపారు. కల్లివెట్టు గ్రామానికి చెందిన శివ ఇంటికి వెళుతూ మార్గంమధ్యలోని వేణుగోపాలపురం వద్ద ఇంటి ముందు మంచంపై నిద్రిస్తున్న 15 ఏళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన బాలిక తల్లిదండ్రులు శివని పట్టుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు. శివపై పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసి, తిరుపతిలోని కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు.

ఐదుగురు ఆకతాయిల బైండోవర్

మండలంలోని కల్లివెట్టు పంచాయతీ పరిధిలోని ఉబ్బలమడుగు జలపాతం వద్ద గొడవపడుతున్న వరదయ్యపాళేనికి చెందిన ఐదుగురు ఆకతాయిలను తహసీల్దార్ సుబ్రమణ్యానికి బైండోవర్ చేసినట్లు ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. మళ్లీ తప్పు చేస్తే రూ.లక్ష జరిమానా కడతామని వారి నుంచి బాండ్ తీసుకుని వదిలారని తెలిపారు.